సాక్షి తిరుపతి

సోమవారం । 11 । నవంబర్ । 2024



22 కిలోల గంజాయి స్వాధీనం

22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, విక్రేతలు, కొనుగోలుదారులను చంద్రగిరి పోలీసులు అరెస్టు చేశారు. - 8లో





స్నానమాచరించేందుకు వెళ్లి..

చిల్లకూరు మండలంలో ఇద్దరు అయ్యప్పభక్తులు చెరువులోకి స్నానానికి దిగి ఈతరాక చనిపోయారు. - 8లో

బెల్టుషాపులపై దాడులు



తిరుపతి రూరల్‌లో అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి సాంస్కృతిక సమ్మేళనం



అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర అగ్రికల్చర్ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ మొదటి విడత అంతర కళాశాలల క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం 2024–25 కార్యక్రమం మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీవరకు కళాశాల క్రీడాప్రాంగణంలో సాంస్కృతిక సమ్మేళనం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్జీరంగా వర్సిటీ పరిధిలోని వ్యవసాయ, ఇంజినీరింగ్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన సుమారు 410 మంది విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. ప్రారంభోత్సవానికి వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి, ఎస్వీయూ వీసీ అప్పారావు, ఆర్‌ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, డీన్ డాక్టర్ కరుణాసాగర్ హాజరవుతారని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 73,558 మంది స్వామివారిని దర్శించుకోగా 32,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైమ్‌స్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఏపీపీడీఈఏ డిస్కం అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న శేషారెడ్డి

తిరుపతి రూరల్ : ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ (ఏపీపీడీఈఏ) సదరన్ డిస్కం (ఎస్పీడీసీఎల్) అధ్యక్షుడిగా ఏవీ సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి వీరయ్యచౌదరి ఎన్నికల అధికారిగా, వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి కేవీ శేషారెడ్డి పర్యవేక్షణలో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ సలహాదారుడిగా సాయిసుధాకర్, ప్రధానకార్యదర్శిగా నాగరాజు, సహాయ జనరల్ సెక్రటరీగా రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా చంద్రమోహన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా యోగానంద్, వెంకటేశ్వర్లు, గణపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బాలచంద్రన్, మదన్‌మోహన్, మరో 13 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, నాగరాజు మాట్లాడుతూ సబ్ ఇంజినీర్ల ప్రమోషన్లు, ఫీల్డ్‌లో ఎదురవుతున్న సమస్యలను ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నేడు లక్ష దీపారాధన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న వైష్ణవ కోనేరులో సోమవారం లక్షదీపారాధన నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం ప్రదోష కాలం 5 నుంచి 6 గంటల లోపు లక్ష దీపారాధన జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

15న యోగుల పర్వతంపై కార్తీక దీపోత్సవం



కార్తీక దీపోత్సవం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతాప్ స్వామీజీ, రంగస్థలి కళాకారులు

తిరుపతి కల్చరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రామచంద్రాపురం మండలంలో ఉన్న యోగుల పర్వతంపై ఈనెల 15న అఖండ కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ తెలిపారు. కార్తీక దీపోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆదివారం నేరేళ్లమ్మ ఆలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర్ణమి రోజు సాయంత్రం యోగుల పర్వతంపై 1503 లీటర్ల ఆవు నెయ్యితో 2007 మీటర్ల ఒత్తితో ఆరడుగుల కొప్పెరలో కార్తీక దీపోత్సవం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ వేడుకకు జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇదే రోజు దేవతామూర్తులకు అభిషేకాలు ఉంటాయని, అనంతరం భక్తులకు అన్నదానం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి కేఎస్ రాజా, గుండాల గోపీనాథ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నేనే సిలికా డాన్!

తిరుపతి జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి సిలికా డాన్‌గా మారిపోయారు. అధికారంలోకి రాకముందు అందరితో మంచిగా నటిస్తూ అందరివాడిగా పేరు తెచ్చుకున్నారు. అధికారం వచ్చిన వెంటనే కంటి చూపుతో అధికారులను, మైనింగ్ వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తూ భారీ స్థాయిలో డబ్బులు పిండుకుంటున్నారు. ఆయన కోరినంత ముడుపులు ఇస్తే ఆశీర్వదిస్తాడు.. లేదంటే కంటి చూపుతో తొక్కేస్తాడు. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలో సిలికా దందాపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



- సిలికా కోసం టీడీపీ నేత పెద్ద స్కెచ్
- ఐదు నెలల్లో 10 వేల టన్నుల హాంఫట్
- సదరు నేత ఆదేశాలతో నిల్వలపై అధికారుల విచారణ
- భారీ జరిమానాలతో బెదరగొట్టిన వైనం
- ఆపై తనవద్దకు రప్పించుకుని బేరసారాలు
- కప్పం చెల్లిస్తేనే సిలికా అక్రమ రవాణాకు అనుమతులు
- గూడూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమైన సిలికా దందా!

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీల నేతలు ప్రకృతి సంపదపై దృష్టి సారించారు. అందినకాడికి అడ్డంగా ఇసుక, మట్టి, గ్రావెల్‌ని కొల్లగొట్టారు. తాజాగా జిల్లాలో విస్తారంగా దొరికే క్వార్ట్జ్, సిలికాపై కన్నేశారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా.. పక్క జిల్లాలోని లైసెన్స్‌లను చూపించి విచ్చలవిడిగా తవ్వి తరలించేస్తున్నారు.

అంతకంతకూ పెంచేసి.. విక్రయాలు సాగించేసి..

కప్పం చెల్లించాక సిలికా అక్రమ రవాణాకు టీడీపీ నేత గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. జరిమానా డబ్బులు, కప్పం రూపంలో చెల్లించిన నగదు రాబట్టుకునేందుకు డీలర్లు, టీడీపీ నేత కుమ్మక్కై సిలికా రేట్లను భారీగా పెంచేశారు. గతంలో టన్ను రూ.700 నుంచి రూ.900 వరకు పలికితే.. అదే సిలికా నేడు టన్ను రూ.4వేల చొప్పున కంపెనీలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. కంపెనీలు అవసరాలను బట్టి మిగిలిన వాషింగ్ ప్లాంట్లు యజమానులు స్థానిక నేత సహకారంతో సిలికాను అక్రమంగా తరలించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది. త్రిమూర్తుల ద్వారా 250 మందికి పైగా ఉన్నా సిలికా డీలర్లను టీడీపీ నేత తన గుప్పెట్లోకి తెచ్చుకొని కోట్ల రూపాయలు రాబట్టేందుకు వ్యూహం రచిస్తున్నట్లు సమాచారం. అందుకు నజరానాగా త్రిమూర్తులు స్థానిక నేత సహకారంతో అనుమతులు లేని అటవీ.. రెవెన్యూ భూముల్లో ఎక్కువ భాగం సిలికాను తవ్వుకుని తమకు అనుమతులు ఇచ్చిన భూముల్లో కొంత తవ్వి నిల్వ చేసుకుంటున్నట్లు సమాచారం. డీలర్లు చేస్తున్న వ్యాపారంలో ప్రభుత్వానికి రాయల్టీ చెల్లింపుల్లో భాగంగా వారు కట్టిన జీఎస్టీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. సిలికాపై గనుల శాఖ అధికారులు నిజాయితీగా దృష్టి సారిస్తే అక్రమంగా కోట్ల రూపాయలు దోచుకుంటున్న డీలర్ల బాగోతం బయటకు వస్తుందని చెబుతున్నారు.

కప్పం చెల్లిస్తే.. రైట్ రైట్

కాసుల కోసమే కాచుక్కూర్చున్న స్థానిక నేత నిల్వ కేంద్ర నిర్వాహకుల నుంచి భారీ స్థాయిలో కప్పం చెల్లించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. ఆ నేత ఆదేశాల మేరకు గనులశాఖ అధికారులు భారీ జరిమానాలు విధించారు. త్రిమూర్తులుగా పిలువబడే సిలికా నిర్వాహకులు, మరో వ్యాపార సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తి మొత్తం నలుగురు యండీయల్ డీలర్లు, సిలికా వాషింగ్ ప్లాంట్ల యజమానులు కలిసి టీడీపీ నేతకు కోట్ల రూపాయలు కప్పం చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే భారీ స్థాయి జరిమానా నుంచి కొంత తగ్గించి చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా ఆ జరిమానాను చెల్లించి బయటపడినట్లు గూడూరులో చర్చ నడుస్తోంది.

బఫర్ జోన్లలో మైనింగ్?

సిలికా మైనింగ్ ప్రాంతాల్లో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం బఫర్ జోన్లు గుర్తించారు. ఆ జోన్‌లో మైనింగ్ చేయకూడదనే నిబంధన ఉంది. అయితే ఈ నిబంధనలు పక్కనబెట్టి మైనింగ్ చేపడుతున్నారు. అదేవిధంగా త్రిమూర్తులు ఏర్పాటు చేసిన వాషింగ్ ప్లాంట్ సోనకాలువ బఫర్ జోన్ నిబంధనలకు పూర్తి వ్యతిరేకం. ఆ వాషింగ్ ప్లాంటుకు మూడు మీటర్ల దూరంలో సోనా కాలువ పోతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సోనా కాలువ ఇరువైపులా 50 మీటర్ల వరకు మైనింగ్ చేయకూడదు. ఈ నిబంధనను అడ్డుపెట్టుకుని స్థానిక నేత అధికారుల చేత ప్లాంటు సీజ్ చేయిస్తానని త్రిమూర్తులను బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

అధికారులను రెచ్చగొట్టి.. తనవద్దకు రప్పించుకుని!

తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు, కోట మండలాల్లో విస్తారంగా ఉన్న సిలికా ఖనిజ సంపదపై కూటమి నేతలు దృష్టి పెట్టారు. ప్రభుత్వ మైనింగ్.. రవాణా బాధ్యతలు తీసుకున్నామని పైకి చెబుతున్నప్పటికీ స్థానిక నేత అండదండలతో అధికార పార్టీ నాయకులు రాత్రికి రాత్రే అక్రమంగా తరలించి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పూర్తి స్థాయిలో సిలికాను కొల్లగొట్టేందుకు అధికారపార్టీ నేత గనులశాఖ అధికారులను ఉసిగొల్పారు. అందులో భాగంగా ఇటీవల సిలికా నిల్వలపై గనులశాఖాధికారులు విచారణ చేపట్టారు. ఏ డంపింగ్ యార్డులో ఎంత సిలికా నిల్వలు ఉన్నాయనే విషయాలను వెలికితీసే ప్రయత్నం చేశారు. మైన్స్, యార్డుల్లోని సిలికా నిల్వల్లో తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించిన అధికారులు ప్రతి నిల్వ కేంద్రానికి భారీ స్థాయిలో జరిమానా విధించేందుకు నివేదికలు సిద్ధం చేశారు. టీడీపీ నేత ఊహించినట్టే.. కొంతమంది మైనింగ్ డీలర్లు ఈ భారీ జరిమానాల నుంచి తప్పించుకునేందుకు సదరు నేతను ఆశ్రయించారు.

లీజు ముగిసిన వాటిపై టీడీపీ నేత కన్ను

చిల్లకూరు, కోట మండలాల్లోని తీర ప్రాంతాల్లో ఉన్న సిలికా గనుల్లో ఎక్కువ భాగం ఇప్పటికే లీజులు ముగిశాయి. అయితే వీటిపై కన్నేసిన అధికార పార్టీ నాయకులు స్థానిక నేత అండదండలతో వాటిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొంతమందిని ఇప్పటికే స్థానిక నేత పిలిపించి మంతనాలు జరిపి నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. స్థానిక నేత, ఆయనకు కొమ్ముకాస్తున్న అధికారుల నుంచి కాపాడాలని మైనింగ్ డీలర్లు యజమానులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా సోనకాలువకు అతి సమీపంలో వాషింగ్ ప్లాంట్



చిల్లకూరు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా సిలికా డంపింగ్ యార్డు

ఆ అధికారిని బదిలీ చేయలేరా?

గూడూరు డివిజన్ మైనింగ్ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి కొన్ని సంవత్సరాలుగా తిష్ట వేసి ఉన్నారు. ఇతను డీలర్లను, మైనింగ్ యజమానులను గుప్పెట్లో పెట్టుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొందరు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇస్తూ దళారీగా మారిపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం ఈ అధికారి బదిలీ కావాల్సి ఉన్నా.. దర్జాగా దందాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విమానాశ్రయ ఆవరణలో వరాహం



విమానాశ్రయ టెర్మినల్ ముందు సంచరిస్తున్న పంది

రేణిగుంట: రేణిగుంట విమానాశ్రయ ఆవరణలో ఓ వరాహం తిరుగుతూ కనిపించడం భద్రతాలోపాన్ని ప్రతిబింబిస్తోంది. కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ విమానాశ్రయం టెర్మినల్ ముందు శనివారం రాత్రి పంది సంచరిస్తూ కనిపించింది. రాజకీయ ప్రముఖులు, వీఐపీలు, శ్రీవారి భక్తులు, విమానాశ్రయానికి రాకపోకలను సాగిస్తుంటారు. కేంద్రబలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఉన్న ఈ ఏరియాలో పంది సంచారాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రీవెన్స్ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తోపాటు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, విభాగాల వారీగా జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేయవచ్చు.

ట్రయల్ రన్ విజయవంతం



శ్రీవారి సారె ట్రయల్ రన్‌లో పాల్గొన్న అధికారులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చివరి రోజున తిరుమల శ్రీవారి నుంచి అమ్మవారికి సమర్పించే శ్రీవారి సారె సమర్పించేందుకు ఆదివారం ఆలయ అధికారులు ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ నెల 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు అమ్మవారి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన పంచమి నాడు అమ్మవారికి తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారెను తీసుకురావడం ఆనవాయితీ. అందులో భాగంగానే తిరుపతి కోమలమ్మ సత్రం నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం వరకు సారె ట్రయల్ రన్ నిర్వహించారు. సారె తీసుకొచ్చే సమయంలో ట్రాఫిక్, ఇతరత్రా సమస్యలు ఎదురవకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, విజిలెన్స్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలకులు స్పందించకపోతే ఉద్యమమే!

- 104 సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- తక్షణం వేతనాలు పెంచి ఆదుకోవాలి
- ప్రభుత్వానికి 104 ఉద్యోగుల హెచ్చరిక



పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులతో కలసి 104 ఉద్యోగుల ధర్నా

తిరుపతి తుడా: రాష్ట్రంలో పనిచేస్తున్న 104 వాహన సేవలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఆదివారం తిరుపతి పాత మున్సిపల్ ఆఫీసు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 104 ఉద్యోగులు గత 16 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని, కానీ రాష్ట్రంలో ఇతర ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల కంటే చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అనంతరం తిరుపతి జిల్లా 104 ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ 104 ఉద్యోగుల సర్వీసులను ప్రభుత్వం గతంలో లాగానే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించడంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం గత మూడేళ్ల నుంచి ఇంక్రిమెంట్ ఇవ్వలేదని వాటిని అరియర్స్ రూపంలో చెల్లించాలన్నారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి బత్తిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మునిరాజ, 104 ఉద్యోగుల కోశాధికారి భువనేశ్వరి, జాయింట్ సెక్రటరీలు ఉపేంద్ర, నవీన్, అశోక్ కుమార్, కమిటీ సభ్యులు దివాకర్, రుద్రయ్య, కోటయ్య, వెంకటరమణ, అభిషేక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి



గత కొన్నేళ్లుగా ప్రజాసేవలో తరిస్తున్నాం. ఇస్తున్న వేతనాలు కుటుంబ అవసరాలకు సైతం చాలడం లేదు. ప్రభుత్వం పెద్ద మనసుతో 104 ఉద్యోగులను ఆదుకోవాలి. ప్రైవేటు యాజమాన్యం కాకుండా ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే వెసులుబాటు కల్పించాలి. పలుమార్లు ప్రభుత్వానికి సమస్యలను ఏకరువు పెట్టాం. – పద్మ, 104 డీఈఓ, చిన్నగొట్టిగల్లు

సేవలను గుర్తించి ఆదుకోవాలి



ప్రభుత్వం మా సేవలను గుర్తించి ఆదుకోవాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కంటే అతి తక్కువ జీతాలకు పనిచేస్తున్నాం. కుటుంబ పోషణ కష్టతరంగా మారింది. కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనాలను వెంటనే పెంచాలి. – భువనేశ్వరి, 104 డీఈఓ, రామచంద్రాపురం

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రైవేటు సంస్థ నుంచి మాకు విముక్తి కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్నాం. కనీసం మా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. కుటుంబాలు గడవని పరిస్థితిలో చాలా మంది సిబ్బంది పనిచేస్తున్నారు. – వెంకటేశ్, 104 ఉద్యోగి, తిరుపతి

అప్పులు చేసి జీవనం..



అతి తక్కువ జీతంతో పని చేస్తున్నాం. ఇంత దారుణమైన పరిస్థితి రాష్ట్రంలో ఏ ఉద్యోగులకు లేదు. పలుమార్లు శాంతియుతంగా నిరసన తెలిపి మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా స్పందించి పరిష్కరించాలని, లేదంటే నిరసనలు ఉధృతం చేస్తాం. – అమరనాథ్, 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, తిరుపతి

నవోదయ దరఖాస్తులకు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 8, 2025 జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 19వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఆ మేరకు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10వ తరగతి చదివే బాలబాలికలు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక శిక్షణ

రేణిగుంట: ఏర్పేడు మండలం నేచనేరి సమీపంలో ఉన్న ఎస్ఓఎస్ బాలల గ్రామంలో ఆదివారం 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఏర్పేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి మండలాల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రముఖ కెరీర్ గైడెన్స్ నిపుణురాలు డా.సుమయ మాట్లాడుతూ 10వ తరగతి తర్వాత అందుబాటులో ఉన్న విద్యాకోర్సులు, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే భవిష్యత్ ప్రణాళికపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. భవిష్యత్‌లో సరైన మార్గాన్ని ఎంచుకోవడానికి అనుగుణంగా, వ్యక్తిగత ఆసక్తి, లక్ష్యాలను గుర్తించడం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో లొకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇస్తున్న నిపుణులు

క్లుప్తంగా

బాలుడి మృతితో మిన్నంటిన ఆర్తనాదాలు

భాకరాపేట : గ్యారంపల్లె రెసిడెన్షియల్ స్కూల్‌లో చిన్నగొట్టిగల్లు దిగువవీధికి చెందిన రెడ్డి మోక్షిత్ (10) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు తెలియడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదివారం ఉదయం గ్యారంపల్లె ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి బిడ్డ మృతి చెందినట్లు తల్లిందండ్రులు కృష్ణమూర్తి, వాణికి సమాచారం అందింది. దీంతో దిగువవీధిలో రెడ్డిమోక్షిత్ ఇంట్లో కుటుంబసభ్యులు, బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. తన బిడ్డకు బలవన్మరణం చేసుకోవాల్సిన అవసరం లేదంటూ తల్లిదండ్రులు రోదించారు. పీలేరు ఆస్పత్రికి బిడ్డను తీసుకొచ్చారని తెలియడంతో దిగువవీధి నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ విషయంపై లోతుగా దర్యాప్తు చేపట్టి తమ బిడ్డ మృతికి గల కారణాలను చెప్పాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆటోడ్రైవర్ మృతి


చిల్లకూరు : గూడూరు పోటుపాళెం సర్కిల్ పరిధిలో జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున ఓ కారు ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన శివ(44) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రయాణికులను వదిలి పట్టణంలోకి వస్తున్న సమయంలో నాయుడుపేట వైపు నుంచి గూడూరుకు వస్తున్న ఓ కారు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడి డ్రైవర్ శివ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రగిరిలో వీధికో బెల్టుషాపు!

చంద్రగిరి నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నేతల కాసుల కక్కుర్తి, అధికారుల అలసత్వం వెరసి మద్యం మాఫియా వీధికో బెల్ట్ షాపు ఏర్పాటు చేసి అందినకాడికి దండుకుంటోంది. నివాస గృహాలు, కిరాణా షాపుల్లోనూ కావాల్సినంత మద్యం దొరుకుతోంది.

నియోజకవర్గంలో 98 బెల్టుషాపులు

- పల్లెల్లో పాగా వేసిన మద్యం మహమ్మారి
- అమ్మకాలు పెరిగేందుకు ప్రోత్సహిస్తున్న మద్యం వ్యాపారులు
- బడ్డీకొట్లు, కూల్‌డ్రింక్ షాపుల్లో నిత్యావసర సరుకుల్లా అమ్మకాలు
- విక్రయాల్లో స్థానిక ప్రజాప్రతినిధికి 30 శాతం వాటా!
- చోద్యం చూస్తున్న అధికారులు
- రోడ్డుపైకి వచ్చేందుకు వణికిపోతున్న మహిళలు, చిన్నారులు



తిరుపతి రూరల్: మద్యం దుకాణాలు, బార్లతో పాటు చంద్రగిరిలోని బెల్ట్ షాపుల్లోనూ 24 గంటలూ అందుబాటులో ఉంటోంది. ఎప్పుడు అంటే అప్పుడు...ఏ బ్రాండ్ అంటే ఆ బ్రాండ్ మద్యం షాపుల మాదిరి ఇళ్లల్లోనే లభ్యమవుతోంది. కిలో మీటర్ల మేర దూరంలోని మద్యం షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే పది, ఇరవై రూపాయలు ఎక్కువ ఇస్తే ఇంటి పక్కనే మద్యం దొరుకుతోంది. మద్యం అమ్మకాల్లో స్థానిక ప్రజాప్రతినిధికి 30 శాతం వాటా ఇవ్వాల్సి వస్తుందని టీడీపీకి కొమ్ముకాసే పత్రిక సైతం పేర్కొనడం గమనార్హం. వాటాల వల్లే పల్లెపల్లెకు మద్యాన్ని విక్రయించాల్సి వస్తోందని వ్యాపారులు ఆఫ్ ది రికార్డుగా వాపోతున్నారు. ఒక్కో మద్యం షాపు పరిధిలో కనీసం 10 నుంచి 15 వరకు బెల్ట్ షాపులు అనుబంధంగా పని చేస్తున్నాయి. విక్రయాలు పెంచి అధిక లాభాలు ఆర్జించేందుకు అక్రమంగా మద్యం అమ్మకాలు సాగించేలా వ్యాపారులే ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. షాపుల నుంచి ఎమ్మార్పీకి కొనుగోలు చేస్తున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.20 అదనంగా వెచ్చించి అమ్మకాలు సాగిస్తున్నారు. గ్రామాలు, వీధులు అనే తేడా లేకుండా ఎక్కడ చూసినా బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి.

చంద్రగిరి నియోజకవర్గంలో 98 బెల్టుషాపులు

చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం వరకు మొత్తం 98 బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. జిల్లాలోనే అత్యధికంగా వాడుకలో ఉన్న బెల్టు షాపులు ఈ నియోజకవర్గంలోనే ఉండడం గమనార్హం. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 33 మద్యం షాపులకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటికి అదనంగా తిరుపతి రూరల్-17, చిన్నగొట్టిగల్లు-23, చంద్రగిరి-21, రామచంద్రాపురం-17, ఎర్రావారిపాళెం-15, పాకాల-5 ఇలా మొత్తం 98 బెల్టుషాపులు నడుస్తున్నట్లు ఓ పరిశీలనలో తేలింది.

రూ.5 లక్షల జరిమానా, లైసెన్స్ రద్దు!

ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే మద్యం విక్రయాలు చేయాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేసినా, అనుమతి లేకుండా బెల్టుషాపులకు విక్రయించినా ఎక్సైజ్ చట్టాల ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయి. మద్యం డిపో నుంచి తీసుకొచ్చిన బాటిళ్లను ఆయా మద్యం షాపుల్లో మాత్రమే విక్రయించాలి. పక్కనే కూర్చోపెట్టుకుని పర్మిట్ రూం మాదిరిగా విక్రయాలు చేయకూడదు. బాటిళ్లు ఓపెన్ చేసి విక్రయించకూడదు. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తూ మొదటి సారి పట్టుబడితే సంబంధిత వైన్‌షాపుపై రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. రెండోసారి కూడా పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయవచ్చు. ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేయకూడదు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లైసెన్స్ ఉన్న షాపుల్లో మాత్రమే విక్రయాలు చేయాలి.

సంసారంలో మద్యం చిచ్చు!

గ్రామాల్లో విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యం కారణంగా పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోందని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే కిరాణకొట్టు..అమ్మేది మద్యం?

నియోజకవర్గంలోని గ్రామాల్లోనూ కొంతమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. దీనికి తోడు మద్యం షాపుల్లో యాజమానులు సిండికేట్‌గా ఏర్పడి ఒక్కో గ్రామానికి రెండు మూడు షాపులు అనే విధంగా నిర్వహిస్తున్నారు. బెల్టు షాపుల్లో సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నా పట్టించుకునేవారు లేరు. ఆహార పదార్థాలు తయారు చేస్తూ మందుబాబులకు అందజేస్తున్నారు. షాపుల మధ్య పోటీ పెరగడంతో కస్టమర్లను ఆకర్షించేందుకు ఇళ్లలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు తాగి మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఆర్సీపురం పరిధిలోని రాయల చెరువు వద్ద మామిడి తోరణాలు కట్టి, అరటి పిలకలు, పూల మాలలు కట్టి ఓ బెల్టుషాపును రిబ్బన్ కట్ చేసి మరీ ఓపెన్ చేయడం కొసమెరుపు.

మండలం పేరు	ప్రైవేటు మద్యం షాపులు	బెల్ట్‌షాపులు
తిరుపతి రూరల్	12	17
చిన్నగొట్టిగల్లు	3	23
చంద్రగిరి	7	21
రామచంద్రాపురం	4	17
ఎర్రావారిపాలెం	2	15
పాకాల	5	5
	33	98

అధికారుల కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు

నియోజకవర్గంలోని గ్రామాల వారీగా ప్రతి రోజూ బెల్ట్ షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం షాపుల యజమానులు అధికారుల అండదండలతో గ్రామ గ్రామాన బెల్ట్ షాపులు నిర్వహిస్తూ వైన్ షాపులను తలపించే విధంగా చేస్తున్నా కానీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల గతంలో స్కూల్‌కు, కళాశాలలకు స్వేచ్ఛగా వెళ్లే బాలికలు ఇప్పుడు వెళ్లలేని పరిస్థితి. రోడ్డులో మద్యం బాబుల ఆగడాలు భరించలేక తల్లిదండ్రులు వెంట రావాల్సిన దుస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని యలమంద ఘటనలోనూ బాలిక ఒంటరిగా వస్తుండగానే దాడికి గురైన ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. అధికారుల నిర్లిప్తతతో మద్యం కల్తీ కూడా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా బెల్టు షాపుల్లో మద్యం కల్తీ విపరీతంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్తీ మద్యం కారణంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం కూడా ఉంది.

బాబు సొంతూరు పక్కనే బెల్టుషాపు

- ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామమైన నారావారిపల్లెకి కూతవేటు దూరంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నారు.
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి రోజూ ఉదయం పూట ప్రత్యేక వాహనాల్లో మద్యం తీసుకొచ్చి, ఆయా ప్రాంతాల్లోని బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా విక్రయిస్తుండడంతో యువత మత్తులోకి వెళ్లి పెడదోవ పడుతున్నారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలు, మహిళలపై దాడులు, దొంగతనాలు, అత్యాచారాలు, నడిరోడ్డుపై గొడవలు చేస్తూ భయానక వాతావరణాన్ని కల్పిస్తున్నారు.
- చంద్రగిరిలో లిక్కర్ పాటు గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. దీనికి నిదర్శనమే ఆదివారం ఎ.కొంగరవారి పల్లి వద్ద పోలీసులు పట్టుకున్న 22 కేజీల గంజాయి.
- ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, విజిలెన్స్, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, తహసీల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ కూడా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.

ఉక్కుపాదం మోపుతాం

జిల్లాలో బెల్టు షాపులను అరికట్టేందుకు ముమ్మర దాడులు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 60 కేసులను నమోదు చేసి, 60 మందిని అరెస్ట్ చేశాం. ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తున్నాం. బెల్టు షాపుల్లో దొరికిన మద్యం ఫలానా మద్యం షాపు నుంచి తీసుకువచ్చాం అని నిర్ధారణ అయితే మొదటిసారి అయితే రూ.5 లక్షల జరిమానా విధిస్తాం. రెండోసారి కూడా మద్యం షాపు ఇలాంటి ఘటనలకే పాల్పడితే లైసెన్స్ కూడా రద్దు చేస్తాం. ఎక్కడ బెల్టుషాపులు నిర్వహించినా ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించి సహకరించాలి.

– నాగమల్లేశ్వరరెడ్డి, జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారి, తిరుపతి జిల్లా

22 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ సుబ్బరామిరెడ్డి

చంద్రగిరి: మండలంలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు విక్రేతలు, మరో ఐదుగురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకున్నట్లు చంద్రగిరి సీఐ సుబ్బరామి రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి జగనన్న కాలనీలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు జరిపినట్లు తెలిపారు. అనంతరం వారి వద్ద నుంచి 22 కిలోల గంజాయితో పాటు విక్రయిస్తున్న వైజాగ్‌కు చెందిన సామిరెడ్డి బేబితో పాటు కొనుగోలు చేసేందుకు వెళ్లిన తిరుచానూరుకు చెందిన నరసింహ, కార్తీక్, ప్రవీణ్, మణికంఠ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ ఖయాం జుబేర్‌ను అదుపులోకి తీసుకుని, శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు. వైజాగ్‌కు చెందిన బేబి, ఆ ప్రాంత సమీపంలోని గిరిజనుల నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరుపతికి చెందిన రమ్యకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ప్రస్తుతం రమ్య పరారీలో ఉందని ఆమె కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిత, ఏఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్నానం ఆచరించేందుకు వెళ్లి ..

చిల్లకూరు: అయ్యప్ప మాలధారులు ధరించి స్నానం ఆచరించేందుకు వెళ్లిన ఇద్దరు భక్తులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం చిల్లకూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నంబాక గ్రామానికి చెందిన నల్లూరు శ్రీకాంత్ (18), కాకి ఆనందబాబు (18) గ్రామంలో కొంతమందితో కలిసి అయ్యప్పమాల ధరించారు. ఈక్రమంలో స్నానం చేసేందుకు చెరువులోకి దిగారు. అయితే లోతు ఎక్కువ ఉండడం.. వారికి ఈత రాకపోవడంతో చనిపోయారు. వీరితో పాటు దిగిన వారికి ఈత రావడంతో ఒడ్డుకు చేరుకుని జరిగిన విషయాన్ని స్థానికులకు చెప్పారు. వారు చెరువులోకి దిగి గాలించి ఇద్దరి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్ఐ సురేష్ బాబు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అన్నంబాకలో విషాదం..

అయ్యప్ప మాలలు ధరించిన యువకులు చెరువులో పడి మృతి చెందడంతో అన్నంబాక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్, ఆనందబాబు గ్రామంలో అందరితో కలివిడిగా ఉంటూ ఉండేవారు. అయ్యప్ప మాలధారణలో ఉండగా మృతి చెందడంతో ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

వివాహానికి వెళ్తుండగా..

- తెలంగాణ ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- జడ్చర్ల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- నారాయణవనంకు చెందిన యువతి మృతి



మునిరాజి (ఫైల్)

నారాయణవనం: తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నారాయణవనానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మునిరాజి(25) చనిపోయింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మట్లవారి వీధిలో నివాసం ఉంటున్న మునిబాబు ఇద్దరి కుమార్తెలు మునిరాజి, చిత్ర హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌లుగా పని చేస్తున్నారు. శనివారం రాత్రి జడ్చర్లలో వివాహానికి హాజరయ్యేందుకు కారులో వస్తుండగా తెలంగాణ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు యువతి కూడా చనిపోయింది. ఆదివారం ఉదయం తెలంగాణ పోలీసుల నుంచి సమాచారం అందడంతో మునిబాబు కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ మూడునెలల కిందటే అక్కచెల్లెల్లు హైదరాబాద్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బెల్టుషాపులపై మెరుపు దాడులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు బెల్టు తీస్తున్నారు. రూరల్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అనధికారికంగా వెలసిన బెల్టు షాపులపై మెరుపు దాడులు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం పెరుమాళ్లపల్లిలో దేవరాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి 25 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. రేణిగుంట మండలం కరకంబాడి వద్ద హుస్సేన్‌బాషాను అరెస్ట్ చేసి 28 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎక్సైజ్ సర్కిల్ సీఐ నరసానాయుడు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు కవీశ్వరనాయుడు, అంజలిప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జట్ల ఎంపిక



జాతీయ ఘట్కా పోటీలకు ఎంపికైన అండర్-19 బాలికల జట్టు

రేణిగుంట: మండలకేంద్రంలోని రేణిగుంట బాలికోన్నత పాఠశాల మైదానంలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అండర్-19 ఏజీఎఫ్ సెక్రటరీ ఎం.జయరామయ్య, అండర్-17 హెచ్‌డీఎఫ్ సెక్రటరీ ఎస్.బాబు, స్టేట్ అబ్జర్వర్ బాల శేఖర్, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధనం బహుమతులను ప్రదానం చేశారు. అలాగే ఈ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారు డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అండర్-19 బాలుర విభాగంలో ..

అండర్-19 బాలుర విభాగంలో జాతీయస్థాయి గట్కా పోటీలకు పవన్ కుమార్ (విశాఖ), జగదీష్ రాము (కృష్ణ), నాగవేణు (కడప), చందు నాయక్ (చిత్తూరు), గణేష్ (విశాఖ), వంశీ రెడ్డి (విశాఖ), హేమంత్ కుమార్ (కృష్ణ), దేవకుమార్ (ప్రకాశం), స్టాండ్ బై హనుమంతరావు (కర్నూలు), చందు నాగసాయి గణేష్ (కృష్ణ), భక్షిత్ (ఈస్ట్ గోదావరి) ఎంపికయ్యారు.

అండర్-17 బాలుర విభాగంలో ..

జాతీయ పోటీలకు హరి చరణ్ (ఈస్ట్ గోదావరి), నవీన్ (కడప), కుషాల్ వెంకట్ (తూర్పుగోదావరి), మనోజ్(కర్నూల్), హర్షవర్ధన్ (విశాఖ), నరేంద్ర కృష్ణ వెంకట, సాయి గణేష్ (తూర్పు గోదావరి), జయసూర్య(కడప), స్టాండ్ బై : యశస్వి (కృష్ణ), దినేష్ నాయక్ (చిత్తూరు), ప్రవీణ్ (విశాఖ) ఎంపికయ్యారు.

అండర్-19 బాలికల విభాగంలో

జాతీయ పోటీలకు అండర్- 19 బాలికల విభాగంలో దాత్రి మగధరమ్మ (చిత్తూరు), బి.జోత్స్న (విశాఖ), రోజా (చిత్తూరు), షణ్ముఖి(తూర్పుగోదావరి), ఉదయశ్రీ (విశాఖ), రాజశ్రీ (చిత్తూరు), మమత (విశాఖ), మేకల ధరణి (ప్రకాశం), స్టాండ్ బై : లలిత (కర్నూల్), దీప్తి (కడప), చందన (చిత్తూరు) ఎంపికయ్యారు.

అండర్-17 బాలికల విభాగంలో..

అండర్-17 బాలికల విభాగంలో జాతీయ పోటీలకు దీక్షిత (కడప), హరిత సెల్వి(కడప), జస్మిత (విశాఖ), కారుణ్య (ఈస్ట్ గోదావరి), హర్షిత (ఈస్ట్ గోదావరి), కీర్తన (కడప), వర్ష (కర్నూల్), సరయు (కృష్ణ)

స్టాండ్ బై: ఉషశ్రీ (చిత్తూరు), హర్షిణి (కడప), శిరీష (విశాఖ) ఎంపికయ్యారు.

ఉద్యోగాలకు శిక్షణ

తిరుపతి అర్బన్: విద్యార్హత ఆధారంగా ఉద్యోగ అవకాశాలు పొందడానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ విభాగం జిల్లా అధికారి లోకనాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న వారిని జర్మనీ దేశానికి పంపడానికి ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

35 ఏళ్లలోపు వయసు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. స్విమ్స్ నర్సింగ్ కళాశాల వద్ద శిక్షణ ఉంటుందని చెప్పారు. జర్మనీ భాషను సైతం నేర్పిస్తారని స్పష్టం చేశారు. శిక్షణా సమయంలో ఉచితంగా భోజన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, జననం ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్ తదితర వాటిని సమర్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఉందని, డిసెంబర్ 1వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. అదనపు సమాచారం కోసం 99888 53335 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

రేణిగుంట: శ్రీకాళహస్తి నియోజకవర్గం, ఏర్పేడు మండలం, రాజులకండ్రిగ ఎస్టీ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తనకు పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జయచంద్ర ఆదివారం తెలిపారు. రేణిగుంట మండలం, ఎల్లమండ్యం ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్(22) శనివారం రాత్రి రాజులకండ్రిగలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. ఆ ఇంటి సమీపంలోనే ఉన్న ఓ బాలికను ఉద్దేశపూరితంగా దుర్భాషలాడుతూ అసభ్య ప్రవర్తనకు పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీంతో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పాత కక్షల నేపథ్యంలోనే హత్య



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వీవీ రమణకుమార్

- లక్ష్మయ్య హత్యకు పాల్పడిన 10 మంది అరెస్టు
- మీడియా సమావేశంలో గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్

వెంకటగిరి(సైదాపురం): పాత కక్షల నేపథ్యంలోనే బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన అల్లం లక్ష్మయ్యను హత్య చేసినట్లు గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం వెంకటగిరి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్యకేసు వివరాలతో పాటు నిందితుల అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జయంపు గ్రామానికి చెందిన అల్లం లక్ష్మయ్యకు అదే గ్రామానికి చెందిన శివారెడ్డి కల్యాణ్‌రెడ్డి, శివారెడ్డి జనార్దన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఈనెల 2వ తేదీన మధ్య ఘర్షణ జరిగింది. ఈ మేరకు ఇద్దరూ బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇంతలోనే శివారెడ్డి కల్యాణ్‌రెడ్డి లక్ష్మయ్యను హత్య చేయించేందుకు తిరుపతిలోని తన స్నేహితుల ద్వారా రూ.1 లక్ష సుపారీ మాట్లాడి రూ.20 వేలు అడ్వాన్సు చెల్లించాడు. ఈ నెల 5వ తేదీన తిరుపతికి చెందిన కొందరు యువకులు టెంపో వాహనంలో జయంపు గ్రామానికి వచ్చి తాము పోలీసులమంటూ విచారణకు రావాలని లక్ష్మయ్యను తీసుకెళ్లారు. స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పరిసర ప్రాంతాల్లో గాలించగా వ్యవసాయ పొలాల్లో రక్తపు మరకల్లో పడి ఉన్న లక్ష్మయ్యను గుర్తించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

అతి కిరాతకంగా హత్య..

తిరుపతి నుంచి వచ్చిన యువకులు లక్ష్మయ్య హత్యకు జాకీ రాడ్లు, కర్రలను ఉపయోగించారని, ఆపై కట్టర్‌తో చేతివేళ్లను కట్ చేసి కిరాతకంగా హత్య చేశారని డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టామన్నారు. నిందితులు వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో శివారెడ్డి కల్యాణ్‌రెడ్డి, తిరుపతి పట్టణం ఎమ్మార్‌పల్లికి చెందిన కలిచట్ల మధు, కలిచట్ల గోపి, తిరుపతి పట్టణం కొర్లగుంటకు చెందిన చింతపట్ల సురేష్, ఏఎస్ మహల్‌కు చెందిన సాకే దినేశన్, తిరుపతి దామినీడు ప్రాంతానికి చెందిన అప్పల స్వామి, ఆర్కాట్‌సాయి, అరవ ఉదయ్, ప్రతాప్, విజయ్‌ను అరెస్టు చేశామన్నారు. అలాగే లక్ష్మయ్య ఆచూకీ కోసం సహకరించిన జయంపు గ్రామానికి చెందిన మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, అతనిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి ఏపీ39ఎంఎస్1091 టెంపో వాహనం, 6 సెల్‌ఫోన్లు, రూ.12 వేలు నగదు, రాడ్లు, కర్రలు, కట్టర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరాల విషయంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు కఠినంగా వ్యవహరిస్తున్నారని, ఈ మేరకు హత్యకు పాల్పడిన వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయనున్నట్లు చెప్పారు. సీఐ ఏవీ రమణ, ఎస్ఐలు సుబ్బారావు, గోపి, సిబ్బంది పాల్గొన్నారు.